# 68

# యేసు పాతిపెట్టబడుట

# (27:57-66)

అరిమతయియ యోసేపు యేసు దేహమును పాతిపెట్టుటకు పిలాతు నుండి అనుమతి సంపాదించుకొనిన తరువాత, అతడు యేసు దేహమును తన సొంత సమాధిలో ఉంచాడు (27:57-61). మరుసటి దినాన, అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమున, వారు యేసు సమాధి యొద్ద కావలి వారిని ఏర్పాటు చేయుటకు యూదుల నాయకులకు పిలాతు అనుమతి నిచ్చాడు. ఆయన శిష్యులలో ఎవరైనా యేసు దేహమును ఎత్తుకొనిపోయి ఆయన మృతులలో నుండి లేపబడినాడని స్వాధికారంతో చెప్పుటను నిషేధించవలెనను ఆశతో ఈ అనుమతి ఇవ్వబడింది (27:62-66).

### యేసు దేహము పాతిపెట్టబడుట (27:57-61)

**57యేసు శిష్యుడుగానున్న అరిమతయియ యోసేపు అను ఒక ధనవంతుడు సాయంకాలమైనప్పుడు వచ్చి 58పిలాతునొద్దకు వెళ్లి, యేసు దేహమును తనకిమ్మని అడుగగా, పిలాతు దానిని అతని కప్పగింప నాజ్ఞాపించెను. 59యోసేపు ఆ దేహమును తీసికొని శుభ్రమైన నారబట్టతో చుట్టి 60తాను రాతిలో తొలిపించుకొనిన క్రొత్త సమాధిలో దానిని ఉంచి, సమాధి ద్వారమునకు పెద్దరాయి పొర్లించి వెళ్లిపోయెను. 61మగ్దలేనే మరియయు, వేరొక మరియయు, అక్కడనే సమాధికి ఎదురుగాకూర్చుండియుండిరి.**

విశ్రాంతిదినము సమీపించుచుండినది గనుక, వారు త్వరగా తమ ప్రాణాలు కోల్పోవునట్లు యేసు మరియు ఆయనతో కూడ సిలువవేయబడిన ఇద్దరు దొంగల కాళ్లు విరుగగొట్టబడవలెనని యూదుల పాలకులు పిలాతును విన్నవించుకొన్నారని యోహాను వ్రాసిన సువార్త చెప్పుచున్నది (యోహాను 19:31). వ్రేలాడుచుండినవారి కాళ్లు విరుగగొట్టబడినప్పుడు, వారు ఊపిరి పీల్చుకొనుటకు తమ కాళ్లు పైకి ఎత్తలేకపోదురు, గనుక వారు అక్షరాలా ఊపిరాడక చచ్చిపోదురు. సైనికులు ఇద్దరు దొంగల కాళ్లు విరుగగొట్టారు; కానీ అప్పటికే యేసు మరణించాడని కనుగొని, వారు ఆయన కాళ్లు విరుగగొట్టలేదు. ఈ చర్య కీర్తనలు 34:20లోని ప్రవచన వాక్కులను నెరవేర్చినది: "ఆయన వాని ఎముకలన్నిటిని కాపాడును, వాటిలో ఒక్కటైనను విరిగిపోదు" (యోహాను 19:36). యేసు నిజముగానే మరణించాడని రూఢిపర్చుకొనుట సైనికులతో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచాడు, "వెంటనే రక్తమును నీళ్లను కారెను" (యోహాను 19:34).

ఆ నాడు శుక్రవారం గనుక అది విశ్రాంతి దినము కొరకు "సిద్ధపరచు దినమై యుండినది." మృతమైన దేహములను సిలువల మీదనే ఆ రాత్రంతా ఉండనిచ్చుటకు యూదుల నాయకులు ఇష్టపడలేదు (యోహాను 19:31) ద్రాను మీద వ్రేలాడదీయబడినవాడు సూర్యాస్తమయమునకు మునుపే దింపివేయబడవలెనని ధర్మశాస్త్రము సెలవిచ్చినది

(ద్వితీయోపదేశకాండము 21:22, 23). యేసు మధ్యాహ్నము మూడు గంటలకు మరణించాడు. విశ్రాంతిదినము సాయంకాలము ఆరు గంటలకు మొదలౌతుంది గనుక, సిలువల మీద నుండి దేహములను దింపివేయుటకు యూదులు ప్రయత్నించుచుండిరి.[1]

"సిద్ధపరచు దినము" (*paraskeuē*), "శుక్రవారము"నకు ఒక సాంకేతికపరమైన. పదమై యుండినది, గనుక ఆధునిక గ్రీకు దేశములో నేడు సహితము ఇదే విధానము కొనసాగుచున్నది, ఈ విశ్రాంతి దినము మహా పరిశుద్ధ దినమై యుండినది, ఏలయనగా అది పస్కా విశ్రాంతి దినమై యుండినది (యోహాను 19:31). వారు ఆతురపడుచుండినందు వలన, యేసును వెంబడించుచుండినవారు ఆయన దేహము పాతిపెట్టబడుటకు, వాడుక ప్రకారము సరియైన విధంగా సిద్ధపరచలేకపోయారు. అందు వలననే స్త్రీలు ఆదివారం ఉదయాన్నే సమాధి యొద్దకు వెళ్లారు (లూకా 23:55–24:1).

**వచనము 57. యోసేపు** స్వస్థలము యూదా దేశ పట్టణమైన **అరిమతయియ**. ఈ పేరు రామా (లేక రామతయి-మ్సోఫీము) అను పేరుకు సమానమైనదై యుండును, ఈ పట్టణము సమూయేలు పట్టణమై యుండినది (1 సమూయేలు 1:1, 19, 20). ఇదే పట్టణము ఈ నాడు, "రెంటి" అని పిలువబడుచున్నది. అరిమతయియ యోసేపు సన్హెడ్రిన్ మహా సభలో ఒక "ఘనతవహించిన సభ్యుడై" యుండెను (మార్కు 15:43; లూకా 23:50), అనేకులు ఆతని "ఆలోచన" కొరకు వెదకుచు పాటించుచుండిరని స్పష్టమగుచున్నది. ఏది ఏమైనా, యూదులు యేసు యెడల చేపట్టిన చర్యలకు అతడు సమ్మతించలేదు (లూకా 23:51). ఈ **ధనవంతుడు** దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచుచుండెను (మార్కు 15:43). ఇంత వరకు, ఈయన రహస్యముగా **యేసు శిష్యుడై** యుండెను (యోహాను 19:38; 12:42 చూడు), కానీ ఇప్పుడు ఈయన యేసుతో గల తన సంబంధమును బట్టబయలు చేసికొన్నాడు. ఆసక్తికరంగా, "యేసును వెంబడించుచుండిన వారిలో అనేకులు అచ్చోట నుండి పారిపోయి దాగుకొనునట్లు చేసిన యేసు సిలువ మరణము, ఈ యోసేపుపై వ్యతిరేకమైన ప్రభావము చూపి ఆయన బహిరంగముగా బయటకు వచ్చునట్లు చేసినది."[2]

**వచనము 58.** యేసు సిలువవేయబడినందు వలన, ఆయన దేహమును సిలువ మీద నుండి దింపి పాతిపెట్టబడుటకు రోమా అధికారుల అనుమతి పొందవలసిన అవసరముండినది. కాబట్టి యేసు కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు లేదా ఆయన అపొస్తలులలో ఎవరైనా ఒకరు ఇందు నిమిత్తము వచ్చెదరేమో అని ఆశింపబడినది. అట్లయినప్పటికిని, అలా జరుగలేదు.

దాపరికము నుండి వెలుపలికి వచ్చి, అరిమతయియ యోసేపు "ధైర్యమును కూడగట్టుకొని" (మార్కు 15:43) **పిలాతు** నొద్దకు వెళ్లి అతడు పాతిపెట్టునట్లు **యేసు దేహము** తనకిమ్మని పిలాతునడిగాడు. యేసు అప్పటికే తన ప్రాణము కోల్పోయాడని తెలిసికొనిన ఈ ప్రభుత్వాధికారి ఆశ్చర్యపోయాడు, కాబట్టి ఆ విషయాన్ని రూఢిపర్చుకొనుటకు పర్యవేక్షకుడైన శతాధిపతిని పిలాతు పిలిపించాడు (మార్కు 15:44). యేసు మరణించాడని రూఢిపర్చుకొన్న పిదప, పిలాతు యేసు దేహమును ఈ యోసేపునకు అప్పగించాడు (మార్కు 15:45).

**వచనము 59. యోసేపు, యేసు దేహమును** సిలువ మీద నుండి దింపి (మార్కు 15:46; లూకా 23:53), **ఆ దేహమును తీసికొని శుభ్రమైన నారబట్టతో చుట్టాడు**. ఇది

బహుశా వెలుపలి బట్టయై యుండును లేదా మృతదేహముపై కప్పబడు బట్టయై యుండును. యేసు పాతిపెట్టబడిన ప్రక్రియ గూర్చి యోహాను ఎక్కువ వివరములు సమకూర్చుచున్నాడు. "వారు యేసు దేహమును ఎత్తికొనివచ్చి, యూదులు పాతిపెట్టు మర్యాద చొప్పున సుగంధద్రవ్యములు దానికి పూసి నారబట్టలు చుట్టిరి" (యోహాను 19:40). మృతదేహము పూర్తిగా చుట్టబడునంత వరకు, ఐగుప్తీయులు చేసినట్లే, సుగంధద్రవ్యములో ముంచబడిన నారబట్టల నుపయోగించుచు, యూదులు మృతదేహములను చుట్టుచుండిరి.[3] లాజరు, "కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను; అతని ముఖమునకు రుమాలు కట్టియుండెను" (యోహాను 11:44).

యోసేపు యేసును తనకై తాను పాతిపెట్టలేదు. ఆయనతో కూడ నీకొదేము ఉండినాడు, నీకొదేము యూదులకు మరొక పరిపాలకుడై యుండెను, యేసు యొద్దకు రాత్రి వేళ వచ్చినది ఈయనే (యోహాను 3:1–21). సన్హెడ్రిన్ మహా సభ సభ్యుడుగా, యోహాను 7:50, 51 ప్రకారము, యేసునకు న్యాయసమ్మతమైన తీర్పు తీర్చబడవలెనని పోరాడాడు. ఆ సమయంలో, అతడు కూడ క్రీస్తు శిష్యుడై యుండెనని నిందింపబడినాడు. ఈయన యేసును రహస్యముగా వెంబడించుచుండిన శిష్యులలో ఒకడై యుండెను, కానీ ఇప్పుడిక దానిని రహస్యముగా దాచలేకపోయాడు. ఈయన యేసు దేహము పాతిపెట్టబడుటకు ఎంతో ఖరీదైన సుగంధ ద్రవ్యమును సమకూర్చాడు: రమారమి నూట ఏబది సేర్ల యెత్తు బోళముతో కలిపిన అగరు తెచ్చాడు (యోహాను 19:39).

**వచనము 60.** యేసు దేహము సిద్ధపరచబడిన తరువాత, యోసేపు **తాను రాతిలో తొలిపించుకొనిన క్రొత్త సమాధిలో దానిని ఉంచెను** ఏ కోణంలో చూచినా, ఈ వాస్తవము ఎంతో గమనార్హమైన విషయమై యున్నది. (1) యోసేపు చేపట్టిన దయగల ఈ చర్య నిజముగా ఒక గొప్ప త్యాగమై యుండినది. ఈయన తన సొంతం కోసం సిద్ధంచేసుకొన్న దానిని వదులుకొన్నాడు. యేసు ఒక నేరస్థునిగా ఖండింపబడినాడు గనుక ఆయనతో కూడ మరెవరైనను అదే సమాధిలో పాతిపెట్టబడుటకు యూదులు అనుమతించి యుండకపోవచ్చును. గనుక యోసేపు తన నిమిత్తము మరొక సమాధిని కొనుక్కొనవలసి యుండును. (2) ఖండింపబడిన నేరస్థులు సర్వసాధారణంగా గౌరవప్రదమైన విధానంలో పాతిపెట్టబడలేదు. ఉపయోగింపబడని సమాధిలో పాతిపెట్టబడుట (యోహాను 19:41)[4] అందులోను సన్హెడ్రిన్ మహా సభ సభ్యుడైన ఒకనికి చెందిన సమాధిలో పాతిపెట్టబడుట, కొన్ని గడియల క్రితమే సిలువవేయబడినవానికి చెప్పశక్యముకాని గౌరవమై యుండెను! (3) యేసు ఈ విధంగా పాతిపెట్టబడుట ఒక ప్రవచన నెరవేర్పై యుండినది. ఈ సమాధి – సహజ గుహయై యుండుటకు బదులుగా – రాతిలో "తొలిపించబడినదై" యుండుట అది ఈ "ధనవంతునికి" ఎంత ఖరీదైనదై యుండినదో ధ్రువీకరించుచున్నది (27:57). శ్రమ నొందు సేవకునికి సంబంధించినంత వరకు, "అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమించబడెను, ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెనని" ప్రవక్తయైన యెషయా ప్రవచించినాడు (యెషయా 53:9).

యేసు దేహము భద్రముగా **సమాధిలో** ఉంచబడిన తరువాత, యోసేపు **సమాధి ద్వారమునకు పెద్ద రాయి పొర్లించాడు**. ఆ కాలములో ఉండిన కొన్ని సమాధుల వలెనే, రాయిని దొర్లించుటకు సులభముగా ఉండునట్లు దీని ముందర కూడ ఒక ఇనప కమ్మల

దారి ఏర్పాటుచేయబడి యుండవచ్చును.[5] ఆ రాయి ఎంతో పెద్దదిగాను బరువైనదిగాను ఉండినది; గనుక పునరుత్థాన దినమున పెందలకడనే యేసు దేహమునకు పూయవలెనని సుగంధద్రవ్యములు తీసికొని సమాధి యొద్దకు వచ్చుచుండిన స్త్రీలు వారి నిమిత్తము ఆ రాయిని ఎవడు దొర్లించగలడని తమలో తాము అనుకొనుచుండిరి (మార్కు 16:2-4). శవములను ఎత్తికొనిపోవుచుండినవారికి ఇంతటి పెద్ద రాళ్లు నిరుత్సాహపర్చే అడ్డంకులుగా పనికివచ్చుచుండినవి; మరియు, అంత కంటె ముఖ్యముగా, జంతువులు మృత దేహములను ఆహారముగా సేవించకుండునట్లు నిరోధించినవి. యేసు సమాధి ప్రవేశ ద్వారము తక్కువ ఎత్తులో ఉండినది; ఏలయనగా, అది ఖాళీగా ఉండినప్పుడు, దాని లోపలకు చూడగోరిన పేతురు మరియు యోహాను వంగవలసి వచ్చినది (యోహాను 20:5). ఈ ఏర్పాట్లు ఆ రోజుల్లో సమాధులు నిర్మింపబడిన విధానమునకు పోసాగినవై యుండినవి.

యేసు సమాధి ఆయన సిలువవేయబడిన చోటుకు సమీపముగా ఉండిన ఒక తోటలో ఉండినది (యోహాను 19:41). ఈ రోజుల్లో యెరూషలేమును సందర్శించుటకు వెళ్లువారికి ఈ సమాధి ఉండిన సాంప్రదాయికమైన రెండు స్థలములు చూపించబడును (27:33పై గల వ్యాఖ్యానము చూడు). మొదటిది, గొల్గొతాకు ప్రక్కన, *ది చర్చ్ ఆఫ్ ది హోలీ సెపల్కర్* లోపల నున్నది. ఈ సమాధికి సంబంధించిన సాంప్రదాయము - ఈ సమాధి దాని అసలు రూపములో భద్రపరచబడలేదు - కాన్‌స్టాంటైన్ చక్రవర్తి మరియు అతని తల్లి హెలేన (నాలుగవ శతాబ్దము నాటి) కాలము వరకు వెనుకకు వెళ్లుచున్నది. యేసు పాతిపెట్టబడిన సమాధి ఇదే అని కొందరు నమ్ముదురు.

రెండవ స్థలమ, గోర్డన్ సమాధి, గోర్డన్ కలువరి గిరికి అతి సమీపములో కలదు. ఏది ఏమైనా, దీనికి సంబంధించిన సాంప్రదాయము, పంతొమ్మిదవ శతాబ్దమునకు సంబంధించినదై యున్నది. ఈ సమాధికి అడ్డుగా ఉంచుటకు పెద్ద రాయిని సులభముగా దొర్లించుటకు ఏర్పాటు చేయబడిన ఇనప కమ్ముల దారి కలదు, యేసు సమాధికి కూడ ఈ ఏర్పాటు ఉండుట సాధ్యమే, కానీ పురావస్తు శాస్త్రవేతలు ఈ సమాధి క్రీ.పూ. ఎనిమిదవ లేదా ఏడవ శతాబ్దమునకు సంబంధించినదని చెప్పుటకు ఇతర లక్షణములు హేతువయ్యాయి. కాబట్టి యేసు పాతిపెట్టబడిన సమాధి ఇదే అని చెప్పుట అత్యంత సంశయమైన సంగతిగా మిగిలియున్నది.

**వచనము 61. మగ్దలేనే మరియ** మరియు **వేరొక మరియ** (యాకోబు యోసే అను వారి తల్లి) అరిమతయియ యోసేపు మరియు నీకొదేము వెంట సమాధి యొద్దకు వెళ్లారు. "గలిలయలో నుండి ఆయనతో కూడ వచ్చిన స్త్రీలు" అని లూకా చేయుచున్న సామాన్య ప్రస్తావన (లూకా 23:55) వారితో సలోమే కూడ ఉండినదను ధ్వనింపు నీయవచ్చును (27:56పై గల వ్యాఖ్యానము చూడు). ఈ స్త్రీలు **సమాధికి ఎదురుగా కూర్చుండి యుండిరి**. యేసు పాతిపెట్టబడిన ప్రక్రియనంతటిని గమనించిన తరువాత, వారు పండుగ సమయంలో తాము బసచేసిన చోటికి తిరిగి వచ్చారు. విశ్రాంతి దినము గడిచిపోయిన తరువాత, యేసు దేహమునకు పూయుటకై వారు సుగంధద్రవ్యములను సిద్ధపర్చారు (మార్కు 16:1; లూకా 23:56).

## పిలాతు జారీచేసిన నిరోధక ఉత్తరువు (27:62-66)

**[62]మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమున ప్రధానయాజకులును**
**పరిసయ్యులును పిలాతునొద్దకు కూడివచ్చి [63]-అయ్యా, ఆ వంచకుడు సజీవుడై**
**యుండినప్పుడు - మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు**
**జ్ఞాపకమున్నది. [64]కాబట్టి మూడవ దినమువరకు సమాధిని భద్రముచేయ నాజ్ఞాపించుము;**
**వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తుకొనిపోయి -ఆయన మృతులలోనుండి లేచెనని ప్రజలతో**
**చెప్పుదురేమో; అప్పుడు మొదటి వంచనకంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని**
**చెప్పిరి. [65]అందుకు పిలాతు-కావలివారున్నారుగదా మీరు వెళ్లి మీ చేతనైనంత మట్టుకు**
**సమాధిని భద్రముచేయుడని వారితో చెప్పెను. [66]వారు వెళ్లి కావలివారిని కూడ ఉంచుకొని,**
**రాతికి ముద్రవేసి సమాధిని భద్రముచేసిరి.**

**వచనములు 62, 63. మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినము** విశ్రాంతి దినమై లేక శనివారమై యుండినది. ఈ సమయంలో, యేసు - వారు యేసును **ఆ వంచకుడు** అని సంబోధించాడు - **మూడు దినములైన తరువాత నేను లేచెదను** అని ముందుగానే తెలియజెప్పిన విషయమును పిలాతునకు తెలియజెప్పుటకు **ప్రధాన యాజకులును పరిసయ్యులును పిలాతు** నొద్దకు కూడి వచ్చారు. ఆయన శ్రమ నొంది మరణించిన పిదప, మరలా మూడవ దినమున తిరిగి లేచునని యేసు ఏకాంతమందు తన శిష్యులతో చెప్పాడు (16:21; 17:9, 22, 23; 20:18, 19). ఇతర సమయాల్లో, యేసు యూదుల నాయకులు మరియు ప్రజల యెదుట ఇటువంటి ప్రకటనలు చేసాడు. ఆయన వారికి ఒక సూచన క్రియను చూపించవలెనని శాస్త్రులు మరియు పరిసయ్యులు ఆయనను అడిగినప్పుడు, యోనాను గూర్చిన సూచక క్రియయే గాని మరి ఏ సూచన క్రియయైనను వారికి అనుగ్రహింపబడదని యేసు సెలవిచ్చాడు. ప్రవక్తయైన యోనా మూడు రాత్రింబగళ్లు తిమింగలము కడుపులో ఏలాగుండెనో, ఆలాగుననే యేసు కూడ మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండును (12:39, 40). యేసు తన దేహము గూర్చి సెలవిచ్చుచు, "ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని" చెప్పాడు (యోహాను 2:19). ఈ ఘోషణ అర్థమును వారు అంతకు మునుపు గ్రహించలేదని నటించుచుండిరి (26:61; 27:40), అయితే ఆయన తన సొంత శరీరమును గూర్చి సూచించుచుండెననియు మృతులలో నుండి లేచుననియు ఇప్పుడు సంపూర్తిగా గ్రహించారు.

**వచనము 64**. యేసు పలికిన ఈ ప్రవచనమును వారు తమ మనస్సుల్లో ఉంచుకొని, **ఆయన శిష్యులు** వచ్చి యేసు దేహమును ఎత్తుకొనిపోయి ఆయన మృతులలో నుండి లేచాడని ప్రజలతో చెప్పుదురేమో గనుక **మూడవ దినము వరకు** సమాధి భద్రము చేయబడునట్లు పిలాతు ఆజ్ఞాపించవలెనని ఆతనిని అడిగాడు. ఇంకా, **అప్పుడు మొదటి వంచన కంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని** కూడ వారు చెప్పారు.[6] వారి ఆలోచనా ధోరణిలో, ఆయన మెస్సీయ యని యేసు సాధికారంతో సెలవిచ్చినది మొదటి వంచనయై యుండును, మరియు ఆయన మృతులలో నుండి లేచాడనునది రెండవ వంచనయై యుండును. ప్రధాన యాజకులు సద్దూకయ్యుల గుంపుకు చెందినవారనియు, యూదులలోని ఈ గుంపు

వారు పునరుత్థానమందు విశ్వసించలేదనియు గుర్తుంచుకొనవలెను (22:23; అపొస్తలుల కార్యములు 23:8).

యూదుల పరిపాలకుల ప్రధాన ఆందోళన అనవసరమైనదై యుండినది, ఏలయనగా యేసు మృతులలో నుండి లేపబడునని శిష్యులు విశ్వసించలేదు (మార్కు 9:10, 32; యోహాను 20:9 చూడు). యేసు మృతులలో నుండి లేచియున్నడని మగ్దలేనే మరియ వారితో చెప్పిన తరవాత కూడ వారు చెప్పుచుండినది వాస్తవమని వారు నమ్మలేదు (మార్కు 16:11, 14), యేసు పునరుత్థానము గూర్చిన సమాచారము అబద్ధమే అయినప్పటికినీ – వారి అధికారమునకు బెదిరింపుగా ఆయన చేసిన ఉపదేశముల కంటె ఆయన పునరుత్థానము గూర్చిన సమాచారమే అతి గొప్ప బెదిరింపై యుండునని యూదులు అనుకొన్నారు.

**వచనము 65. పిలాతు** వారు చేసిన మనవికి తలొగ్గాడు గనుక సమాధి యొద్ద కాపలాగా ఉండుటకు వారికి **కావలివారిని** ఏర్పాటు చేసాడు. కాపలాదారుల కొరకు యూదుల నాయకులు పిలాతును మనవిచేయవలసి వచ్చినదను వాస్తవము మరియు 28:11–15లోని గమనిక ద్వారా ఈ కాపలాదారులు యూదుల దేవాలయ అధిపతులు కాదు గాని రోమా ప్రభుత్వ సైనికులై యుండిరను విషయము స్పష్టమగుచున్నది. “కావాలివాడు” అని అనువదింపబడిన గ్రీకు పదము (*koustōdia*) వాస్తవమునకు లాటిన్ భాషలోని (*custodia*) అను పదమునకు లిప్యంతరీకరణమై యున్నది. “Custodian” మరియు “custody” అను ఆంగ్ల పదములు ఈ పదము నుంచి ఉత్పత్తియైనవే.

**వచనము 66.** ప్రధాన యాజకులు మరియు పరిసయ్యులు, పిలాతు వారికి సెలవిచ్చినట్లే, **వెళ్లి సమాధిని భద్రము చేసిరని** చెప్పబడుచున్నది. సమాధి వెలుపల రోమా ప్రభుత్వ **కావలివారిని** నియమించి, **రాతికి ముద్రవేసారు**. ఇది రాతికి అడ్డముగాను సమాధి ద్వారమునకు ఇరువైపులను కలిపి కట్టబడిన ఒక పెద్ద తాడై యుండవచ్చును. ఈ తాడుకు లక్క గాని లేదా ఒండ్రు మట్టిని గాని అంతటించి రోమా ప్రభుత్వాధికార చిహ్నాము గల ముద్ర వేసి యుందురు. ఇటువంటి ముద్ర దేని మీదనైనను వేయబడినప్పుడు, ఈ ముద్రను చెడగొట్టి సమాధితో చెలగాటమాడిన వారికి మరణమే గతి యను ప్రభుత్వ ఉత్తరువు కూడ జారీ చేయబడును.

అయితే ఏ కావలివాడైనను, సమాధి ఎంత జాగ్రత్తగా భద్రము చేయబడినప్పటికిని, యేసు మృతులలో నుండి పునరుత్థానుడు కాకుండునట్లు ఆయన దేహమును సమాధిలోనే బంధించి యుంచనేరవని పిలాతు గాని యూదులు గాని తెలిసికొన లేదు! వారు ఆదిలోనే అనుకొన్నట్లు, వదంతులు వ్యాపించకుండునట్లు నిరోధించుటకు బదులుగా, సమాధిని భద్రము చేయుట వాస్తవమునకు యేసు పునరుత్థాన సత్యమును అధికారపూర్వకంగా రూఢిపర్చుటకే ప్రయోజనకరమయ్యింది.

---

సూచనలు

[1]Josephus *Wars* 4.5.2; Mishnah *Shabbath* 23.4–5 చూడు. [2]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co.,

1992), 728. [3]Tacitus *Histories* 5.5. [4]R. T. France గమనించుచున్నట్లుగా, "ఒక క్రొత్త సమాధి, అంత వరకు ఉపయోగించబడదని దాని వలె, అనగా, దాని లోని ఏ ఒక్క భాగములోనైనను ఎవరును పాతిపెట్టబడకుండా, ఇటీవలనే దాని నిర్మాణ పనులు పూర్తిచేయబడిన సమాధి కాదు" (R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985], 403; 8:21; 26:3) పై గల వ్యాఖ్యానము చూడు. [5]దొర్లింపబడు రాళ్లు గల సమాధుల గూర్చిన ఆదనపు సమాచారము కొరకు, Mark Strauss, "Luke," *in Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke* (Grand Rapids, Mich.: Zondervan, 2002), 496. చూడు. [6]"మొదటి దాని కంటె చివరిదే చెడ్డదై యుండును" అను పదజాలము ఒక నుడికార వ్యక్తీకరణమై యుండినది (12:45; 2 పేతురు 2:20 చూడు).